సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శనివారం 11 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 313 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## కేబుల్ న్యూస్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ దరఖాస్తుల ఆహ్వానం



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రతినిధి: కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు పొందేందుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి హెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా స్టూడియోలు కలిగి స్థానికంగా మరియు జిల్లాల్లో ప్రసారాలు అందించే చానళ్లు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్డులు పొందేందుకు, అలాగే జిల్లా స్థాయిలో స్టూడియోలు ఉన్నవారు ఆయా జిల్లాల్లో అక్రిడిటేషన్ పొందేందుకు ఈ నెల 17వ తేదీ లోపు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో ఛానల్ పేరు, స్టూడియో చిరునామా వివరాలతో పాటు ఎంఐబీ సర్టిఫికెట్, లేబర్ లైసెన్స్, ఎంఎస్ఓలతో చేసుకున్న ఛానల్ ప్లేస్మెంట్ ఒప్పందాల ప్రతులను జతచేయాలని స్పష్టం చేశారు. అర్హత గల చానళ్లకు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయబడతాయని వివరించారు.

## బీజేపీ మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ముందడుగు

## మహిళా రిజర్వేషన్ హామీని నిలబెట్టాం – మహిళల సాధికారతకు కట్టుబడి ముందడుగు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 11, ప్రతినిధి: మహిళల అభివృద్ధి, సాధికారతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రముఖ నాయకుడు స్పష్టం చేశారు. 1994లోనే మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రతిపాదనను ఆమోదించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఆ సమయంలోనే రాజకీయాలు మరియు సంస్థాగత వ్యవస్థల్లో మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలనే దిశగా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలంటే వారికి సమాన అవకాశాలు, రిజర్వేషన్ అవసరమనే భావనతో ముందుకు సాగామని వివరించారు.సంస్థలోనే కాకుండా ప్రభుత్వంలో కూడా మహిళలకు ప్రాధాన్యం కల్పించే విధంగా చర్యలు తీసుకున్నామని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత మహిళా రిజర్వేషన్ హామీని అమలు చేసి తమ మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. ఇది కేవలం రాజకీయ హామీ మాత్రమే కాకుండా మహిళల భవిష్యత్తును మార్చే చారిత్రాత్మక నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు పాలనలో భాగస్వాములు కావడం వల్ల సమాజంలో సమానత్వం పెరుగుతుందని, వారి ఆలోచనలు, నాయకత్వం దేశ అభివృద్ధికి దోహదపడుతాయని పేర్కొన్నారు.మహిళల కోసం విద్య, ఉపాధి, ఆరోగ్యం, భద్రత వంటి అంశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు మహిళలకు అవకాశాలు విస్తరించేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని చెప్పారు.భవిష్యత్తులో కూడా మహిళల సాధికారత కోసం మరిన్ని సంస్కరణలు తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళలు సమాజంలో కీలక పాత్ర పోషించాలంటే రాజకీయాల్లో వారి భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం తమ బాధ్యతగా భావిస్తూ, అన్ని రంగాల్లో వారికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.



**1994లోనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం**



## ఖజానాలో కష్టమున్నా.. సంక్షేమంలో రాజీ లేదు

సందేశం టైమ్స్, నేలకొండపల్లి, ఏప్రిల్ 11, ప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ నిరుపేదల సంక్షేమంలో ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయబోదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నేలకొండపల్లి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ప్రజల దీవెనలతో ఏర్పడిన ఈ ప్రజా ప్రభుత్వంలో పేదల వైద్యం, విద్యకు పెద్దపీట వేస్తున్నామని, ఖజానాపై భారం ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలను తప్పకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. కోనాయిగూడెంలో రూ.34 లక్షలతో బాలికల వసతిగృహ పాఠశాల, జూనియర్ కళాశాల భవన మరమ్మతు పనులకు శంకుస్థాపన చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఏప్రిల్ చివరి లేదా మే మొదటి వారంలో రెండో విడత ప్రారంభమవుతుందని వెల్లడించారు. నాచేపల్లిలో రూ.23 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, గ్రామంలో మొత్తం రూ.2.69 కోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 132 మంది బాధితులకు రూ.45.66 లక్షల చెక్కులు, 27 మందికి కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రైతులకు భరోసా కల్పిస్తూ ఇప్పటికే 25 లక్షల మందికి రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులను సోషల్ మీడియా నుంచి దూరంగా ఉంచేందుకు చట్టం దిశగా చర్యలు

సందేశం టైమ్స్, ఉండవల్లి, ఏప్రిల్ 11, ప్రతినిధి: చిన్నపిల్లలను సోషల్ మీడియా ప్రభావం నుంచి దూరంగా ఉంచేందుకు విధివిధానాల రూపకల్పనతో పాటు ప్రత్యేక చట్టం తీసుకురావడంపై ఉండవల్లి నివాసంలో మంత్రుల బృందం, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సృజనాత్మకత దెబ్బతినకుండా వారికి సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించేలా చట్టం రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు, ఐ & పీఆర్ డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, ఐజీ ఏకే రవికృష్ణ, సైబర్ క్రైమ్ ఎస్పీ అదిరాజ్ సింగ్ రానా, ఐ & పీఆర్ అధికారులు మరియు సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొని చట్టం విధివిధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## బెంగళూరులో గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



సందేశం టైమ్స్, బెంగళూరు, ఏప్రిల్ 11, ప్రతినిధి: బెంగళూరు సర్జాపూర్‌లోని సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రీన్వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐబీడీపీ (గ్రేడ్-12) గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు పాఠశాలలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్ట్ గ్యాలరీ, ఆధునిక తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్వా గ్రూప్ ఎండీ మరియు పాఠశాల చైర్మన్ బిజయ్ అగర్వాల్, మేనేజింగ్ ట్రస్టీ నీరు అగర్వాల్ తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఏప్రిల్ 26న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా పిలుపు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రతినిధి: ప్రైవేట్ విద్యాసంస్థల్లో అడ్డగోలు ఫీజుల వసూళ్లపై వ్యతిరేకంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ప్రకటించారు. సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులపై పెరుగుతున్న ఫీజుల భారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, విద్య వ్యాపారంగా మారడం అన్యాయమని ఆయన విమర్శించారు. విద్య హక్కు చట్టం (ఆర్టీఈ)ను కచ్చితంగా అమలు చేయాలని, ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని తమ హక్కుల కోసం గళం విప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.



# పెద్దారెడ్డిపేటలో తుల్జా భవాని జాతరలో ఘనంగా గంగాభిషేకం

సందేశం టైమ్స్, పుల్కల్, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామంలో శ్రీ తుల్జా భవాని అమ్మవారి 33వ జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమై అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులు కోలాటాల మధ్య 251 కలశాలతో గంగను తీసుకువచ్చి అమ్మవారికి మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, భక్తులు, గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని జాతరను వైభవంగా జరిపించారు.

# బస్వరాజు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పోతుల బొగుడ గ్రామానికి చెందిన ముద్దపురం బస్వరాజు అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, బస్వరాజు గ్రామానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దపురం రాజు, బీఆర్ఎస్ అధ్యక్షులు శేఖర్, మాజీ సర్పంచ్ నర్సమ్మ యాదగిరి, రాజశేఖర్, పి.శివకుమార్, చంటి శ్రీహరి, చంటి అనిల్, చాకలి మనయ్య తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ జయంతికి ఖేడ్‌లో భారీగా తరలి రావాలని పిలుపు

సందేశం టైమ్స్, కంగ్టి, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలో శుక్రవారం నాడు నారాయణఖేడ్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ నాయకులు అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆహ్వాన పత్రికలను ప్రదర్శించి మండలం నుంచి అంబేద్కర్ వారసులు, యువకులు, దళిత నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ వెంకట్ రెడ్డి, ఎస్సైలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో దళిత పెద్దలు భీమన్న, శంకరన్న, డేవిడ్, సంజయ్, విజయ్, ప్రకాష్, బాబు, సర్పంచ్ బాబు దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో భాగంగా యోగా, ఆయుష్ ఆరోగ్య శిబిరాలు నిర్వహణ





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా యోగా కార్యక్రమాలు, ఆయుష్ ఆరోగ్య శిబిరాలు శుక్రవారం నిర్వహించారు. ఉదయం 6:30 నుంచి 7:30 గంటల వరకు జరిగిన యోగా కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు ప్రారంభించి ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనంతరం సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ భవనంలో నిర్వహించిన ఆయుష్ ఆరోగ్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ పాండు ప్రారంభించారు. ఈ శిబిరంలో యునాని, హోమియోపతి, ఆయుర్వేద వైద్యులు ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయడంతో పాటు రక్తపోటు, రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం. వసంతరావు, డీడబ్ల్యూఓ లలిత కుమారి, ఎంఆర్ఓ జయరాం, వైద్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# ఉన్నత లక్ష్యాలే విజయానికి తొలి అడుగు కలెక్టర్ పి. ప్రవీణ్య





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 11, ప్రతినిధి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య సూచించారు. శుక్రవారం పటాన్ చెర్వు మండలం ముత్తంగిలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆమె 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు జీవితం లో అత్యంత కీలక దశగా పేర్కొన్నారు. ఈ దశలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, ఇంటర్ అనంతరం జరిగే NEET, JEE అడ్వాన్స్, EAMCET వంటి పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ అవసరమని, అవాంతరాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించి నూతనంగా ఏర్పాటు చేసిన చపాతీ మేకింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కామధేను ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# సంగారెడ్డి జిల్లాలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమాలు – ఎస్పీ ఆదేశాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను ఈ నెల 13 నుంచి 18 వరకు ఆరు రోజుల పాటు విస్తృతంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు, యువకులతో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడంతో పాటు ప్రమాదాల దృశ్యాలను ఎల్ఈడి స్క్రీన్లు, ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో వాల్ పెయింటింగ్‌లు, పోలీసు కళాబృందాల నాటికలు, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, సోషల్ మీడియా ద్వారా ట్రాఫిక్ నియమాలపై విస్తృత ప్రచారం చేయాలని పేర్కొన్నారు. పోలీసులే ముందుగా నిబంధనలు పాటించి ఆదర్శంగా నిలవాలని, ఉల్లంఘన చేసిన సిబ్బందిపై కూడా చలానాలు విధించాలని స్పష్టం చేశారు. ఆటో, లారీ, బస్ డ్రైవర్ యూనియన్‌లతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలు, విద్యార్థులు, డ్రైవర్లు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని రోడ్డు భద్రతకు సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# కాలనీల్లో కలెక్టర్ పర్యటన – ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలోని ఆర్సిపురం మండలం మార్క్స్ నగర్, ఇక్రిశాట్ కాలనీలలో శుక్రవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యా హౌసింగ్ పీడీ చలపతి రావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారా, ఇళ్ల అవసరం ఉందా అనే విషయాలను పరిశీలించారు. జి+5 మోడల్ నిర్మాణంపై కాలనీవాసుల అభిప్రాయాలను సేకరించి అర్హులైన వారు ముందుకు వచ్చి ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి ప్రజల్లో అవగాహన కల్పించారు.



## లబ్ధిదారులకు ఆర్థిక భరోసా – ప్రభుత్వ పథకాల ప్రాధాన్యం వివరించిన జి. అంజయ్య

సందేశం టైమ్స్, రాయికోడ్, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జి. అంజయ్య మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకుండా ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆశాజ్యోతి, నాయబ్ తహశీల్దార్ నరేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్, మాజీ యూత్ అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీ నర్సింలు, రఫిక్, పలు గ్రామాల సర్పంచ్‌లు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ నేతల అరెస్ట్ – గాంధీభవన్ ముట్టడికి యత్నం



సందేశం టైమ్స్, రాయికోడ్, ఏప్రిల్ 11, ప్రతినిధి: రాయికోడ్ మండలంలో ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'హలో ముదిరాజ్ – చలో గాంధీభవన్ ముట్టడి' కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ వర్గానికి న్యాయం చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ గాంధీభవన్ ముట్టడికి యత్నించిన ముదిరాజ్ నాయకులను పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ తాలూకా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పెద్దోడి శంకర్ ముదిరాజ్, పట్టణ సంఘం అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మహేష్ ముదిరాజ్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో ఇతర బీసీ, బహుజన సంఘాలు కూడా భాగస్వామ్యం అవుతున్నాయని, ఇది సమాజ భవిష్యత్తుకు కీలక ఉద్యమమని పేర్కొన్నారు.




## ముదిరాజ్ నేతల ముందస్తు అరెస్టులు అసెంబ్లీ ముట్టడికి అడ్డుకట్ట

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 11, ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ముదిరాజుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో అల్లాదుర్గం మండల ముదిరాజ్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. చలో గాంధీభవన్ కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం ఉదయం ఇంటివద్దనే నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఇటువంటి అరెస్టులతో ముదిరాజుల ఉద్యమాన్ని అణచివేయలేరని, తమ హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముందస్తు అరెస్టులు పిరికిపంద చర్యలని, ముదిరాజులను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నాలను తాము తిప్పికొడతామని తెలిపారు. ఎన్నికల హామీల మేరకు ముదిరాజులకు న్యాయం చేయాలని, బీసీ వర్గీకరణలో మార్పులు చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కనకంటి భూమయ్య, ప్రధాన కార్యదర్శి బాధనే బేతయ్య, మురడి రాములు, బుచ్చయ్య, దొంత లక్ష్మయ్య, బోయిని సత్తయ్య, కళాయి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## నగల్‌గిద్ద జెడ్పీ హైస్కూల్‌లో గ్రంథాలయ ఏర్పాటుకు ఎమ్మెల్యే సందర్శన

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నగల్‌గిద్ద మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసే దిశగా శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రరీ ఏర్పాటుకు అనుకూలంగా ఒక గదిని పరిశీలించి, విద్యార్థుల అభ్యాసానికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సర్పంచ్ అనిల్ పాటిల్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## అంబేద్కర్ జయంతి మహా ర్యాలీకి ఎమ్మెల్యేకు ఆహ్వానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 11, ప్రతినిధి: ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలో జరగనున్న మహా ర్యాలీలో పాల్గొనాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.




## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 11, ప్రతినిధి: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవనశైలి సాధ్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" హెల్త్ వీక్‌లో భాగంగా ప్రపంచ హోమియోపతి ఆయుష్ డే సందర్భంగా నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా గురువు ఆకుల రవి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు యోగాసనాలు నిర్వహించగా కలెక్టర్ కూడా వారితో కలిసి ఆసనాలు చేసి అందర్నీ ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత లభిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ విజయ, డీఎస్పీ ప్రసన్నకుమార్, రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, యోగా గురువులు, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిట్కుల్ గ్రామంలో టోర్నమెంట్ ప్రారంభం ఎస్సై నర్సింలు



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 11, ప్రతినిధి: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన క్రీడా టోర్నమెంట్‌ను ఎస్సై నర్సింలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. గ్రామ సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ అఖిల్, మాజీ సర్పంచ్ గొలుసు భూమయ్య, గ్రామ కార్యదర్శి తిరుపతి, కారోబార్ మన్నే పద్మయ్య, బి. కిరణ్, టోర్నమెంట్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు నిత్యజీవితంలో భాగం కావాలి – ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 11, ప్రతినిధి: పటాన్చెరు మండలం భానురు గ్రామంలో టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. ఆయనను స్మరించుకుంటూ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# గడ్డపోతారం పరిశ్రమలో అగ్ని ప్రమాదం భారీగా వ్యాపించిన మంటలు



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారంలోని ఓ రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒకేసారి భారీగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగ సుమారు 8 కిలోమీటర్ల వరకు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం మహాలక్ష్మి న్యూట్రన్స్ కెమికల్స్‌లో సుమారు పది మంది కార్మికులు పనిచేస్తుండగా ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, అయితే ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

# ఎరువుల దుకాణంపై ఆకస్మిక తనిఖీ అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, చిన్న శంకరంపేట, ఏప్రిల్ 11, ప్రతినిధి: మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం గవల్లపల్లి జంగరాయిపేటలోని ఎరువుల దుకాణాన్ని అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, స్టాక్ నిల్వలు, ఇన్వాయిస్‌లను ఆయన పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని దుకాణ యజమానులకు సూచించారు. అనుమతులు లేకుండా నాసిరకం ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల నియంత్రణ చర్యలు – డాగ్ క్యాచర్ల ద్వారా సురక్షితంగా పట్టింపు



సందేశం టైమ్స్, ఏప్రిల్ 11, ప్రతినిధి: గ్రామాల్లో వీధి కుక్కల సమస్య పెరుగుతున్న

కుక్కలను సురక్షితంగా పట్టుకునే చర్యలు చేపట్టారు. ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.కుక్కల వల్ల ప్రజలకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు, రేబిస్ వంటి వ్యాధులు వ్యాపించకుండా నివారించేందుకు, అలాగే వీధి కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పట్టుకున్న కుక్కలకు టీకాలు వేయడం, అవసరమైతే నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించడం అనంతరం వాటిని తిరిగి అదే ప్రాంతంలో వదిలే విధానం అనుసరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, డాగ్ క్యాచర్లకు సహకరించాలని, కుక్కలను అడ్డుకోవడం లేదా దాచిపెట్టడం చేయకూడదని అధికారులు సూచించారు.



# రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం – "అరైవ్ అలైవ్ వీక్" నిర్వహణ

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 11, ప్రతినిధి: రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఈ నెల 13 నుంచి 18 వరకు "అరైవ్ అలైవ్ వీక్" కార్యక్రమాలను జిల్లాలో విస్తృతంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలను భాగస్వాములను చేయాలని, గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. రిటైర్డ్ టీచర్లు, డాక్టర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, యువజన సంఘాలతో రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించాలని, పిల్లలకు హెల్మెట్, సీట్ బెల్ట్ అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి అంశాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ గుర్తించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లోనూ రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కొప్పుల లక్ష్మి శేషారెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 11, ప్రతినిధి: వట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి అల్లాదుర్గం మండలం సీతానగర్, రాంపూర్, కాయిదాంపల్లి, గడి పెద్దాపూర్, అల్లాదుర్గం గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం క్వింటాలుకు సాధారణ రకం వరికి రూ.2,389, ఇతర రకాలకు రూ.2,369 మద్దతు ధర కల్పించిందని తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి నియమ నిబంధనలను పాటించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రుక్మిణి, తహసీల్దార్ మల్లయ్య, ఇంచార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో రాజేష్, ఏఈఓ నవీన్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు – అదనపు కలెక్టర్ కె. సీతారామరావు



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 11, ప్రతినిధి: ఏప్రిల్ 20 నుంచి 27 వరకు నిర్వహించనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కె. సీతారామరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించబడతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం వరకు రెండో సెషన్ జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో ఓపెన్ టెన్త్‌కు 6 పరీక్ష కేంద్రాలు, ఓపెన్ ఇంటర్‌కు 11 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 990 మంది టెన్త్ విద్యార్థులు, 2012 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. పరీక్షల కోసం సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్లు నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని ఆదేశించారు. అభ్యర్థుల రవాణాకు ఆర్టీసీ బస్సులు సిద్ధంగా ఉంచాలని, పరీక్షలు ముగిసే వరకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ రవీందర్ రెడ్డి, డీఈఓ అశోక్, డీఐఈఓ భాను నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.